క్లుప్తంగా

శనైశ్చరస్వామి ఆలయంలో పూజలు


వెల్మకన్నలో శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శనైశ్చరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతర శనైశ్చరస్వామికి తైలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. దీంతోపాటు ఆలయం ప్రాంగణంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు వివిధ గ్రామాల భక్తులు శనైశ్చర స్వామిని దర్శించుకున్నారు.

పేరుమారిన ఏపీజీవీబీ



తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా బోర్డు మార్చిన చిట్కుల్ ఏపీజీవీబీ శాఖ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఏపీజీవీబీ చిట్కుల్ శాఖ బోర్డును మార్చి శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై సుమారు 11 ఏళ్ల పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మార్చారు. ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుమీదనే ఖాతాదారులకు సేవలు అందించనుంది.

ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.3.65లక్షలు


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి టెండర్ల ద్వారా రూ.3.65లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆలయ కార్యాలయంలో ఈఓ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ రంగారావులు ఆలయం వద్ద ఏడాది పాటు కొబ్బరి ముక్కలు పోగు చేసేందుకు వేలం నిర్వహించారు. వేలంలో ఈ మేరకు ఆదాయం సమకూరినట్లు ఈఓ చెప్పారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్, శ్యామ్, ప్రతాప్‌రెడ్డి, తదితరులున్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్: మున్సిపల్ అభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ఎదురుగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలు సైతం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గణేశ్ రెడ్డి, నాయకులు కృష్ణ, రవీందర్‌గుప్తా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేట ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు


మహా లింగార్చన చేస్తున్న వేద పండితులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట మధనానంద సరస్వతి స్వామి ఆశ్రమంలో శనివారం కృష్ణానంద సరస్వతీస్వామి వారి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు గురు ప్రార్థన, మహా లింగార్చన నిర్వహించారు. రెండో రోజు ఫిజియోథెరపీ వైద్య శిబిరం, మహా రుద్రం, పీఠాధిపతి మాధవానంద సరస్వతి సమక్షంలో శిష్యుల సర్వసభ్య సమావేశం, శ్రీమద్భాగవత పుస్తకావిష్కరణ జరగనున్నాయి.

మా ఉపాధ్యాయులే కావాలి

- కేజీబీవీ విద్యార్థుల నిరసన
- ఉపాధ్యాయులను వెనక్కి పంపిన వైనం


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ రాధా కిషన్

పాపన్నపేట(మెదక్): కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు కొంతకాలంగా సమ్మె చేస్తుండటంతో ప్రత్యామ్నాయంగా పాపన్నపేట పాఠశాల ఉపాధ్యాయులను ఆ పాఠశాలకు పంపుతూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారు శనివారం కస్తూర్బా పాఠశాలకు వెళ్లారు. విద్యార్థులు తమ పాఠశాల ఉపాధ్యాయులు కావాలని, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు వద్దంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వచ్చిన ఉపాధ్యాయులను తిరిగి వెనక్కి పంపించి వేశారు.

వెనక్కి పంపితే నష్టపోతారు: డీఈఓ రాధా కిషన్

ఉపాధ్యాయులను వెనక్కి పంపిన విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రాధా కిషన్ మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డితో కలిసి పాపన్నపేట కేజీబీవీ పాఠశాలను శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నందున ప్రత్యామ్నాయంగా పాపన్నపేట పాఠశాల ఉపాధ్యాయులను పంపించామని వారిని వెనక్కి పంపడం సమంజసం కాదని పాఠశాల విద్యార్థులకు సూచించారు. మీకు కావాల్సింది విద్య, మీరు నష్టపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇతర పాఠశాల ఉపాధ్యాయులను పంపించారని వివరించారు. ఉపాధ్యాయులను వాపస్ పంపితే మీరే నష్టపోతారని తెలిపారు. ఉపాధ్యాయులు వారి సమస్యల కోసం వారు పోరాడుకుంటారు. మీరు అందులో జోక్యం చేసుకొని మీ జీవితాలు నాశనం చేసుకోవద్దు అంటూ విద్యార్థులకు నచ్చ చెప్పారు. విద్యార్థులకు కేజీబీవీ స్టాఫ్ మద్దతు తెలపడంపై అసహనం వ్యక్తం చేశారు.

ప్రతీ ఇంటిని సర్వే చేయాలి

ఎంపీడీఓ శ్రీనివాస్


కుషన్‌గడ్డతండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): దరఖాస్తుదారుల ప్రతీ ఇంటిని ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కుషన్‌గడ్డ తండాలో పంచాయతీ కార్యదర్శి రేణుకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తుండగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో సర్వే చేస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులు ఇంటివద్ద లేకపోతే పంచాయతీ కార్యదర్శి వద్ద సంప్రదించాలన్నారు.

ఇళ్ల సర్వే పరిశీలన

టేక్మాల్(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మండలంలోని బర్దిపూర్, బొడ్మట్‌పల్లి గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ విఠల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సర్వేను పూర్తి చేయాలన్నారు. నిర్ణిత గడువులోగా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఇందులో కార్యదర్శి గోపి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయ విధులపై అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వర్తించే విధులపై తహసీల్దార్ మన్నన్ అవగాహన కల్పించారు. శనివారం మోడల్‌స్కూల్ ఇంటర్ ఐటీ ఒకేషనల్ విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయ విధుల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్‌తో పాటు భూముల రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు అందించే సేవలతో పాటు భూమి రిజిస్ట్రేషన్ రికార్డులు అందించే సేవలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ టీచర్ ప్రమోద్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ


అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న మాలధారులు


శబరిమల తరలి వెళ్లేందుకు ఇరుముడులు కట్టుకుంటున్న అయ్యప్ప మాలధారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద శనివారం మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు ఇరుముడి కట్టుకొని శబరియాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు కృష్ణమూర్తి, రమేశ్‌గౌడ్, నరేందర్, రంగారావుతో పాటు తదితరులు ఉన్నారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణానికి చెందిన శివాలయం సన్నిధానంలోని అయ్యప్ప మాలధారులు శనివారం ఇరుముడి కట్టుకొని శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి తరలి వెళ్లారు. శంకర్ రెడ్డి, రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టుకొని బయలు దేరారు.

రేగోడ్‌లో..

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ నుంచి శబరిమలకు అయ్యప్ప మాలధారులు శనివారం తరలి వెళ్లారు. మండలం దీక్ష పూర్తి చేసుకొని శబరిమలలో మాల విరమణ చేయనున్నారు. ఇందులో అయ్యప్ప స్వాములు రాములు, కృష్ణ, నాగరాజు, చారి, అమర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని జర్నలిస్టు కుటుంబ సభ్యులను శనివారం లీలా గ్రూప్ చైర్మన్ డా. మోహన్‌నాయక్ పరామర్శించారు. మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నర్సాగౌడ్ అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో అతని కుటుంబాన్ని లీలా గ్రూప్ చైర్మన్ పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగంగౌడ్, రమావత్ రాజు, మాలావత్ బాబు, ఇతర జర్నలిస్టులు యాదగిరి, సత్యం, అమరేందర్ రెడ్డి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటకు దాత వజ్జె రాజు పలు ఆలయాలకు శనివారం బియ్యం విరాళం అందజేశాడు. మండల కేంద్రం శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠం, చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశాడు. ఆలయాల వద్ద నిర్వహిస్తున్న అన్నదానానికి భక్తులు వస్తు, ధన రూపంలో సహాయం అందివ్వాలని వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఈ సాయి కుమార్ తెలిపారు. పిల్లుట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా పిల్లుట్ల, రత్నాపూర్, నాను తండాకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సూచించారు.

టీఏ సస్పెండ్

టేక్మాల్(మెదక్): గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ సాంకేతిక సహాయకులు (టీఏ)గంగారాంను సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక తనిఖీ 14వ విడతలో భాగంగా సదరు టెక్నికల్ అసిస్టెంట్ క్లస్టర్‌లో ఉన్న గ్రామాల్లో అనేక అవినీతి ఆరోపణలతో పాటు నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్నారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజాదర్బార్ రోజు ప్రిసైడింగ్ అధికారికి సదరు టెక్నికల్ అసిస్టెంట్ పరిధి గ్రామాల్లో జరిగిన అవినీతి, నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. వీటిని పరిగణలోనికి తీసుకున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శనివారం టీఏ గంగారాంను సస్పెండ్ చేస్తూ ఉత్తరులను జారీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు


మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకుడు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఉదయ్‌కుమార్‌తో పాటు 20 మంది కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శనివారం చిన్నశంకరంపేటలో పార్టీలో చేరిన వారికి మైనంపల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుల్లారావు, రాజిరెడ్డి, మనోజ్, సురేందర్‌నాయక్ ఉన్నారు.

మాజీ ప్రధానికి మన్మోహన్‌సింగ్‌కు నివాళి


మౌనం పాటిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు

నర్సాపూర్: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు నర్సాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు నివాళులర్పించారు. శనివారం కౌన్సిల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంపై చైర్మన్, కౌన్సిలర్లు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో కమిషనర్ రామకృష్ణరావు, వైస్ చైర్మన్ నయీమోద్దీన్, కౌన్సిలర్లు లత, ఇస్రత్ ఇద్దీఖా, యాదగిరి, రుక్కమ్మ, రాంచందర్, సునీత, బుచ్చేశ్‌యాదవ్, రాజేందర్, లక్ష్మి, సరిత, లలితలో పాటు మేనేజర్ మధుసూదన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన


చేగుంటలో వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

చేగుంట(తూప్రాన్): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం పంచాయతీ కార్మికులు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి మాట్లాడుతూ.. ఐదు నెలలుగా పంచాయతీ కార్మికుల వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిరసన కోసం ఇందిరా పార్కుకు వెళ్తున్న కార్మికులను ప్రభుత్వం అక్రమ అరెస్టులతో అడ్డుకుందన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎల్లం, బాలేశ్, రాజు ఉన్నారు.

చాకరిమెట్లలో శని త్రయోదశి పూజలు


నవగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని అడిషనల్ కలెక్టర్ నగేష్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయం భక్తజన సందడి నెలకొంది. శని త్రయోదశి సందర్భంగా ఆలయ అర్చకులు నవగ్రహాలకు తైలాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నవగ్రహాలకు పూజలు నిర్వహించడంతో పాటు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు అభిషేకం అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు పీఆర్టీయూ ఆర్థిక సాయం


ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఆర్థికసాయం చేస్తున్న పాపన్నపేట పీఆర్టీయూ నాయకులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో 19 రోజులుగా సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పాపన్నపేట మండల ఉద్యోగులకు పీఆర్టీయూ సంఘీభావం తెలిపింది. వారి అవసరాల నిమిత్తం రూ.18 వేలు ఆర్థిక సహకారం అందించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, సురేష్ మాట్లాడుతూ.. న్యాయమైన వారి డిమాండ్లు వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా విద్యాశాఖలో భాగమై చాలీ చాలని వేతనంతో ఇన్నాళ్లు పని చేశారని పెరిగిన నిత్యవసర ధరలు దృష్టిలో ఉంచుకొని వారికి మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పత్రికా సంపాదకులు వెంకటరామిరెడ్డి, కృష్ణమూర్తి, అంజనా చారి, భవాని ప్రసాద్, నింగప్ప జనార్ధన్, విక్రాంత్, తాళ్ల శ్రీనివాస్, దేవయ్య, సిద్ధిరాములు, స్వామి, ప్రవీణ్ కుమార్, పీఆర్టీయూ పాపన్నపేట మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నగరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం స్వాపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు విద్యబోధన నిర్వహించారు. ఇందులో భాగంగా డీఈఓగా విశ్వనాథ్, ఎంఈఓగా సుశాంత్, హెచ్‌ఎంగా అశ్విని విధులు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

డీఈఓ రాధాకిషన్


కంటి పరీక్షలు చేయించుకుంటున్న డీఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ సమస్యలపై స్పందిస్తూనే ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాల ఆవరణలో సురేఖ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వైద్య పరీక్షలు, కంటీ పరీక్షలు చేయించుకొని శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజ్‌గోపాల్‌గౌడ్, పోచయ్య, శివప్రసాద్, సత్యనారాయణ, చిన్నశంకరంపేట, సూరారం, ధరిపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు దీప్లారాథోడ్, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయంలో అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీబాల వీరహనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో శ్రీబాల వీరహనుమాన్‌స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి చందన అలంకరణతో పాటు ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

◆ మహాసభలకు తరలిన ఉపాధ్యాయులు

నర్సాపూర్: నల్గొండలో శనివారం జరిగిన టీఎస్ యూటీఎఫ్ మహాసభలకు నర్సాపూర్ నుంచి యూనియన్ ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. జిల్లా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మారావు, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు నల్గొండకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నినాదాలు చేశారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి వ్యక్తికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో ఎల్‌ఓసీని గ్రామ కాంగ్రెస్ నాయకుడు ముత్యంరెడ్డి చెక్కును అందజేశారు. ఈ మేరకు శనివారం కొద్దిరోజుల క్రితం చల్మెడ గ్రామానికి చెందిన పొడల నవీన్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్స నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు అయింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కపల్లి రామ్‌రెడ్డి, రమేశ్, అబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ముత్యంరెడ్డి, నాగరాజు, గుట్టయ్య అక్కపల్లి, రావుల రామస్వామి, బాపురెడ్డి, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి



నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని ఫొటోగ్రాఫర్ ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం మండల ఫొటోగ్రాఫర్లు అన్నారు. మెదక్ జిల్లా ఎన్నికల కమిటీ స్లిప్పుల పంపిణీలో భాగంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరిగిన తరుణంలో సెల్ ఫోన్లతో ఫొటోగ్రాఫర్ల జీవితాలను దుర్భరంగా అయ్యాయని తెలిపారు. అంతేకాకుండా కెమెరాల రేట్లు లక్షల్లో ఉండడం వలన చిన్న చిన్న ఫొటోగ్రాఫర్లకు ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. ఫొటోగ్రాఫర్లకు జీవన భృతితో పాటు, పెన్షన్ రూపంలో నెల నెలా కొంత ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే బ్యాంక్‌లలో రుణాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఫొటోగ్రాఫర్ ఎన్నికల కమిటీ సభ్యులు, నిజాంపేట మండల ఫొటోగ్రాఫర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని గోపని వెంకటాపురం గ్రామానికి చెందిన సాయిలుకు రూ.60,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం ఫెడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రమేశ, నాయకులు కోణం అంజయ్య, మాణిక్ రెడ్డి, సాయిలు తదితరులు ఉన్నారు.

◆ కారు బైకు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ రూరల్: కారు బైకు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన నర్సాపూర్ – మెదక్ జాతీయ రహదారిలోని రెడ్డిపల్లి వద్ద శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏర్ల నవీన్ బైక్‌పై మెదక్ వైపు ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో బైక్ ధ్వంసమైంది.

◆ భక్తిశ్రద్ధలతో శబరిమాత ఆలయ వార్షికోత్సవం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని తొగిట గ్రామంలో శబరిమాత 27వ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి, విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అఖండ దీపారాధన చేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భజనభక్తబృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.